నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 3 జూన్ 2024 RANGAREDDY


## కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారం



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్, జూన్ 2 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన పోరాటాలు, ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరాంనాయక్, ప్రియ, రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ తెచ్చిన ధీశాలి మాజీ సీఎం కేసీఆర్



మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జడ్పీటీసీ నేనావత్ అనురాధ, బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, జూన్ 2 : తెలంగాణ రాష్ట్రాన్ని కొట్లాడి తెచ్చిన ధీశాలి మాజీ సీఎం కేసీఆర్.. అని జడ్పీటీసీ నేనావత్ అనురాధ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



షాద్‌నగర్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

# పాలమూరు గడ్డ.. బీఆర్ఎస్‌దే..

- ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఘన విజయం
- హస్తం పార్టీ అభ్యర్థిపై 109 ఓట్ల మెజార్టీతో గెలుపు
- అధికార పార్టీ ఆశ్చర్యపోయేలా బీఆర్ఎస్‌కు పట్టం కట్టిన ఓటర్లు
- సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే షాక్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తిన సంబురాలు

షాద్‌నగర్/కొడంగల్/కడ్తాల్/కొత్తూరు, జూన్ 2 : ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. అధికార పార్టీ ఆశ్చర్యపోయే రీతిలో ఓటర్లు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా పాలమూరులో కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చారు. ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి బంపర్ మెజార్టీతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొన్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వం పై ఉన్న నమ్మకం..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు వ్యూహాత్మకంగా వ్యవహరించి నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపులో ప్రధాన భూమికను పోషించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యం కాగా.. మార్చి 28న జరిగిన పోలింగ్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఎంపీ ఎన్నికల అనంతరం ఫలితాలను ప్రకటించాలని ఎన్నికల కమిషన్ సూచించడంతో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించి ఫలితాలను వెల్లడించారు. 1437 ఓట్లకుగాను ఆరు రౌండ్లలో ఫలితాలను ప్రకటించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొదటి రౌండ్ నుంచే బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఆధిక్యతను ప్రదర్శించి.. 109 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై ఘన విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓటుతోనే ఫలితాలు తేలడంతో రెండో ప్రాధాన్యత ఓటును లెక్కించలేదు. కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి 653 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి 762, స్వతంత్ర అభ్యర్థికి ఒక్క ఓటు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పోలైన 1437 ఓట్లలో 21 ఓట్లు చెల్లలేదు. గెలుపు కోసం అధికార పార్టీ నాయకులు తీవ్రంగా కృషిచేసినా బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకంతో ఆ పార్టీ అభ్యర్థికే ఓటర్లు మొగ్గుచూపారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్ తగలడంతో ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. నవీన్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాల్లో మునిగారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డికి షాద్‌నగర్ పట్టణంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పట్టణ ముఖ్యకూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కొత్తూరు చౌరస్తాలో ఉన్న మహాత్మా పూలే విగ్రహానికి కూడా ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడం పట్ల నవీన్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మె ల్యే నవీన్‌కుమార్‌రెడ్డికి జిల్లా బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాదారం నర్సింహగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, బ్యాగరి యాదయ్య, శివచారి, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్ సెగ్మెంట్‌లోని దౌల్తాబాద్ మండలంలో జడ్పీటీసీ కోట్ల మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు.



షాద్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

### అధికార పార్టీకి బిగ్‌షాక్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. స్థానిక సం స్థల ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులున్నా ఓటర్లు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపా రు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఆయన ఈ ఎన్నికపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లా స్థానిక సంస్థల ఓటర్లు కాంగ్రెస్ పార్టీ గట్టి షాక్ ఇచ్చారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఎదురుదెబ్బ పాలమూరు నుంచి తగిలిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పాలనావైఫల్యానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమి ఓ ఉదాహరణగా పేర్కొంటున్నారు.

### కడ్తాల్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ..

స్థానిక సంస్థల ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో ఆదివారం మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో పటాకులుకాల్చి, ఒకరికొకరు మితాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెం కటేశ్‌గుప్తా, ఎంపీటీసీలు గోపాల్, లచ్చి రాంనాయక్, మంజుల, ప్రియ, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, తులసీరాంనాయక్, భూనాథ్‌నాయక్, కృష్ణయ్యయాదవ్, భారతమ్మ, నాయకులు నర్సింహగౌడ్, చంద్రమౌళి, రమేశ్‌నాయక్, లాయక్ అలీ, రామచంద్రయ్య, నర్సింహ, యాదయ్య, పవన్, మల్లేశ్, రమేశ్, జమీర్, సురేశ్, శ్రీను, పాండు, వెంకటేశ్, అంజి, సాబేర్, శ్రీకాంత్, లక్ష్మణ్, మహేశ్, ఇర్షాద్, నరేశ్, గణేశ్, రాజు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దౌల్తాబాద్ మండలంలో ఎమ్మెల్సీ గెలుపుపై సంబురాలు చేసుకొంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

# నేటి నుంచి బడిబాట

- ఈ నెల 11 వరకు వికారాబాద్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహణ
- ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ

బొంరాస్‌పేట, జూన్ 2 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బడీడు పిల్లలు, ఐదేండ్లు నిండిన వారు, బడి బయటి పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ ఏటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు గ్రామాల్లో ఇం టింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనంతో నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. బడిబాటకు సంబంధించి రోజువారీగా నిర్వహించే కార్యక్రమాల షెడ్యూలును జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. అన్ని మండలాల్లో బడిబాటను విజయవంతం చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

- 3వ తేదీన గ్రామస్థాయిలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి బడిబాట ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ గురించి చర్చించడం.. బడీడు పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి మహి ళా సంఘాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించాలి.
- 4వ తేదీన గ్రామాల్లోని ప్రతి ఇంటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలి. బడికి వెళ్తున్న విద్యార్థుల జాబితా తయారు చేసి విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలి.
- 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు బడీడు పిల్లల నమోదు కోసం ఇంటింటి ప్రచా రం నిర్వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులను మోటివేట్ చేయాలి. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి సమీపంలోని భవిత కేంద్రాల్లో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, సౌకర్యాల గురించి కరపత్రాల పంపిణీ ద్వారా అవగాహన కల్పించాలి.
- 11వ తేదీన గ్రామసభ నిర్వహించి 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాల గురించి చర్చించాలి. బడిబాట అనంతరం 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రోజువారీగా చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించాలి. బడిబాట ముగిసిన అనంతరం 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వారం రోజులు ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.






రంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ శశాంక

- తెలంగాణ ఉద్యమంతో రంగారెడ్డి జిల్లాకు విడదీయరాని బంధం
- అమరుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివి
- ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సమగ్రాభివృద్ధి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కలెక్టరేట్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన కలెక్టర్ శశాంక
- వేడుకల్లో పాల్గొన్న రాచకొండ డీసీపీ అరవింద్ కుమార్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు
- వికారాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్ కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ నారాయణరెడ్డి

# దశదిశలా ప్రగతి వెలుగులు

రంగారెడ్డి, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోనూ, ఇటు జిల్లాలోనూ అన్ని రంగాల్లో ప్రగతి వెలుగులు దశదిశలా విరజిమ్ముతున్నాయని కలెక్టర్ శశాంక అన్నారు. ఆదివారం రంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శశాంక ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంతో రంగారెడ్డి జిల్లాకు విడదీయరాని అనుబంధం ఉందని, జిల్లాకు చెందిన అనేకమంది ఉద్యమకారులు ఆత్మబలిదానాలు చేసుకున్నారన్నారు. అమరుల కుటుంబాలు, ఉద్యమకారులకు, స్వ రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ వందనాలు తెలియజేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ స్ఫూర్తితో జిల్లా ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

### సమ ప్రాధాన్యతతో సమగ్రాభివృద్ధి..

జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ.. సమగ్రాభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతున్నామన్నామని కలెక్టర్ అన్నారు. పరిపాలనలో పారదర్శకతతోపాటు ప్రజలకు జవాబుదారీగా ఉండే వాతావరణాన్ని ప్రభుత్వం నెలకొల్పుతున్నదని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 5కోట్ల63 లక్షల మంది మహిళలు ఫ్రీ బస్సు సదుపాయాన్ని వినియోగించుకున్నారన్నారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా జిల్లాలో డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 2,726 మంది ఆరోగ్యశ్రీ వైద్యసేవలు పొందారని..అందుకు రూ. 90,80, 450 ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అయుష్మాన్ భారత్ పథకం కింద 4,29, 722 మంది లబ్ధిదారులకు హెల్త్‌కార్డులు అందించామన్నారు. జిల్లాలో యాసంగి 2023–2024 సీజన్‌కు పెట్టుబడి సహాయంగా ఇప్పటివరకు 3,25,216 మంది రైతుల ఖాతాల్లో రూ.343 కోట్ల 10 లక్షల నిధులను జమ చేశామని.. పాఠశాలల ప్రారంభానికి ముందే బడిబాట కార్యక్రమ నిర్వహణకు జిల్లా యంత్రాంగం ప్రణాళికను తయారు చేసిందని.. ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. విద్యార్థుల యూనిఫామ్‌ను మహిళా సంఘాల సభ్యులతో కుట్టించి వారికి ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు.

### టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు..

జిల్లాలో 2023–24 విద్యాసంవత్సరంలో టెన్త్ పరీక్షలకు 50,948 మంది విద్యార్థులు హాజరు కాగా.. అందులో 46,245 మంది ఉత్తీర్ణులైనట్లు కలెక్టర్ తెలిపారు. ఉత్తీర్ణతాశాతం 90.77 నమోదు కాగా 1,371 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారన్నారు. ఇందులో బాలుర 88.89శాతం, బాలికల ఉత్తీర్ణత 93.32శాతంగా ఉందన్నారు. టెన్త్‌లో 36 ప్రభుత్వ బడులు వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.

అదేవిధంగా ఇంటర్ ప్రథమ ఏడాది ఫలితాల్లో 71.1శాతంతో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో.. ద్వితీయ ఏడాది ఫలితాల్లో 77.63శాతంతో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలోని యువతకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు టాటా టెక్నాలజీస్ కంపెనీ భాగస్వామ్యంతో వర్క్‌షాప్స్ నెలకొల్పి, అడ్వాన్స్‌డ్ స్కిల్ సెంటర్‌ను షాద్ నగర్‌లో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అందుకు అవసరమైన కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

### సమష్టి కృషితో పెరిగిన పోలింగ్..

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు చేపట్టిన చర్యలు ఫలితాలు ఇచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా మహిళలు, యువతకు మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు .. స్వీప్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. 2019 ఎన్నికలతో పోలిస్తే..ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ 3.21శాతం పెరిగిందన్నారు. ఓటింగ్ శాతం పెంపునకు కృషిచేయడంతోపాటు, ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించిన అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 4న జరుగనున్న కౌంటింగ్‌ను అందరి సహకారంతో పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో రాచకొండ డీసీపీ అరవింద్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత..

రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా ఆమనగల్లు కేజీబీవీ విద్యార్థినులు, జడ్పీహెచ్ ఎస్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి మెమెంటోలను అందజేశారు.

అయితే తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు తెలిపేలా తలకొండపల్లి, మాడ్గుల ప్రాంతాల నుంచి విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆలస్యంగా రావడంతో వారికి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం దక్కలేదు. ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. వేడుకల్లో రెండు, మూడు ప్రదర్శనలనే నిర్వహించడం..మధ్యలో మైక్ మొరాయించడం వంటి సంఘటనలు వల్ల ఈసారి వేడుకల్లో ఒకప్పటి కళ తప్పిందన్న అభిప్రాయం సర్వత్రా వినిపించింది.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముందుగా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గర ఉన్న అమరవీరుల స్థూపానికి ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పూల మాలలువేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ స్వరాష్ట్ర పోరాటంలో అమరుల త్యాగాలు మరువలేవని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తై 11వ వసంతంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంలో ఉత్సాహంగా వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అమరుల ఆశయాలు, ఆకాంక్షల మేరకు రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన చేవెళ్ల లోక్‌సభ పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సహ కరిం చిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పదేండ్ల వేడుకను పురస్క రించుకుని తాండూరు బాలికల ఉన్నత పాఠశాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల మోమిన్‌పేట, సరస్వతినిత్య కళాశాల వికారాబాద్, బాల కేంద్రం విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులచే నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జడ్పీచైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ మంజులారమేశ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పోలీసుల విన్యాసాలు



విద్యార్థుల కళాప్రదర్శన

